కథ

# నీలికథ

కవన శర్మ





నీలి, రత్తాలు స్నేహం చేసారు.

నీలి చచ్చిపోయింది. రత్తాలు ఏడ్చింది.


* * *

నీలి, రత్తాలు విశాఖపట్నానికి ఉత్తరాన కళింగ సీమలో ఒక కుగ్రామంలో పెరిగారు. నీలిని విధవరాలైన తల్లి పెంచింది. రత్తాల్ని కాఫీ ఒటేలు నడిపే పెద్దమ్మ పెంచింది. నీలి నల్లని రాతి విగ్రహం. రత్తాలు పచ్చని పసిడి బొమ్మ.

ఇద్దరికి వయస్సు అలం కరించిన ఆభరణాలు అవే రంగుల్లో అమిరాయి. నీలికి ఆమె తల్లి పెళ్లి చెయ్య లేక బహిరంగంగా ఏడ్చేది.

పెద్దమ్మ తనకు పెళ్లి చెయ్యదేమోనని రత్తాలు చాటుగా ఏడ్చేది.

రోజు రత్తాలు నీలి చేరి చెరువులో తానం ఆడేవారు. ఇద్దరు బిందెలలో నీళ్లు ఇళ్లకి చేరవేసేవారు. దారిలో మందారాలో మరేవైనా పువ్వులో కనిపిస్తే కోసి కొప్పులో పెట్టుకొనేవారు. అల్లా ఊళ్లో తిరుగుతున్న వాళ్లిద్దర్ని చూస్తుంటే మగ పుట్టుక పుట్టిన వాళ్లకి కోర్కెలు ఉవ్వెత్తున లేచేవి. అయితే మదు మేహం



ఉన్న వాళ్లు లడ్డూల్ని పళ్లాలలో చూసి నోరు తడుపుకుని సంతోషించినట్టు వయస్సు మళ్లిన వాళ్లు వీళ్లతో వేళాకోళాలాడి సరిపెట్టుకొనేవారు. వయస్సులో ఉన్నవారికి ఏదో చెయ్యాలని అనిపించినా ఊరి భయం వల్ల ఏమీ చేసేవారు కాదు. దాంతో ఊరు ప్రశాంతంగా ఉండిపోయింది.

అటువంటప్పుడు రత్తాలు పెద్దమ్మకి వేలు విడిచిన మేనల్లుడైన సింహాచలం ఊళ్లో దిగాడు. కొన్నాళ్లకి రత్తాలు సింహాచలంతో లేచిపోయిందని ఊరంతా గుప్పుమంది. ఆ తరువాత విశాఖపట్నంలో ముండల కంపెనీలో ఎవరికో కనిపించిదన్నారు. ప్రత్యక్షంగా చూసిన వారెవరూ లేరు.

అప్పుడు మొదలయ్యాయి నీలి కష్టాలు. నీలి తల్లికి నీలి పెళ్లి విషయంలో ఇంక ఆలస్యం పనికి రాదనిపించింది. రత్తాలు లేచిపోయిందన్న వార్త వినగానే - దానికి దీనికి స్నేహం. అది దీనికేం నూరిపోసిపోయిందో - అని భయపడిపోయింది. అంతే తనెరిగిన ప్రతి పెళ్లి కాని యువకుడి గురించి తను అల్లుడిగా చేసుకొనే అవకాశం ఉందేమో అని ఆరాలు తియ్యసాగింది.

యువకుల్లో చాలా మందికి తాళి బొట్టు మాటెత్తగానే అది కట్టాల్సిన నీలి సన్నని మెడ, అది కట్టాక అది సయ్యాటలాడే ప్రదేశం గుర్తుకు వచ్చేవి. కాని వాళ్ల పెద్ద వాళ్లకి మాత్రం నీలి కులగోత్రాలు భాష గుర్తుకువచ్చేవి.

ప్రభుత్వం రికార్డుల ప్రకారం ఆ ఊరు ఆంధ్రాలో చేరినా సరిహద్దు ప్రదేశం కనక ఆ ఊళ్లో కాపులు కళింగులతో పాటు ఒడ్డె (ఓఢ్ర) వారైన కొద్ది గజపతులు కొద్ది మంగళ్లు చాలా మంది పట్నాయక్‌లూ ఉన్నారు. నీలి ఒడ్డెది.

"ఒడ్డె బుద్ధి, జడ్డి బుద్ధి. వాళ్లతో మనకి పొందేమిటి?" పొమ్మన్నారు స్థానికులైన తెలుగు పెద్దలు. ఆర్థికంగా కాస్త ముందున్న వారికి వారి కంటే వెనక బడినవారిని చూస్తే చిన్న చూపుండటం సాధారణం. గోదావరి కృష్ణాజిల్లాలవారు విశాఖ, దాని ఉత్తర జిల్లా జనాలని "అప్పలమ్మల జాతి" అనటం లాగానే ఈ జిల్లాల వారు ఒడ్డెవారిని "బెంటుగాళ్లు" అంటూ చిన్న చూపు చూస్తారు.

అందువల్ల నీలి తల్లి, నీలికి ఒడ్డె సంబంధాలే చూడాల్సి వచ్చింది.

"ఉంచుకునే మాటైతే ఉపద్రవాలే రావు కాని కట్టుకొంటే కొంపలంటుకుపోతాయి" అని పట్నాయక్‌లూ మరి పెద్దలూ బాహాటంగానే అనుకోవడం విన్న నీలి తల్లి, తమ కులంలోనే నీలికి సంబంధాలు వెతకాల్సి వచ్చింది.

నీలికి తన కులం కుర్రాడ్నే ఎందుకు చేసుకోవాలో అందమైన కుర్రాడు ఏకులం వాడో అయితే ఎందుకు చేసుకోరాదో పూర్తిగా తెలియని పదహారేళ్ల వయస్సు.

పక్కూళ్లో తమ కులం కుర్రాడే ఒకడున్నాడని తెలిసి నీలి తల్లి వెళ్లి చూసి వచ్చింది. వాళ్లు వచ్చి నీలిని చూసారు. ఎన్టీవోడిలాగా బలంగా లేకపోయినా ఉంగ రాల జుట్టుతో పెళ్లి కొడుకు బాగానే ఉన్నాడని నీలి సర్దేసుకుంది. కాని పిల్ల వాడి పెద్దలు నీలి తల్లి ఇవ్వగలిగిన కట్నానికి సర్దుకోలేమన్నారు. ఆ మొగుడ్ని కొనుక్కునేవారు పిల్లాడికి కట్నం ఇస్తారు.

నీలికి పదిహేడేళ్లు నిండేసరికి ఆమె గుండెలు మరింత బరువెక్కాయి. నీలి దిగులుతో ఆమె తల్లికి గుండె బరువెక్కింది. అప్పుడు నీలికి భార్య పోయిన యాభై యేళ్ల వాడి సంబంధం వచ్చింది. అతనికి కొద్ది భూమి అందులో పూరిల్లే అయినా కాస్త విశాలంగా తడికలతో రెండు మూడు గదులుగా విభజించబడ్డ ఇల్లూ ఉన్నాయి. కులవృత్తితో ఇంతో అంతో సంపాదిస్తున్నాడు. కూతుళ్లకి పెళ్లి చేసి అత్తవారింళ్లకి పంపించేసాడు. కొడుకు విజయనగరంలో పట్నపు పిల్లను పెళ్లాడి షాపు తెరిచాడు. అందుచేత అతనికి పిల్లల బాధ్యతలు లేవు. వండి వార్చే దిక్కు, కూతుళ్లని పురిళ్లకి పుణ్యాలకి తీసుకువచ్చినప్పుడు ఇల్లు నడిపే దక్షతగల స్త్రీ అవసరం అయింది. ఆ స్త్రీ తనకి స్త్రీ సుఖం ఇచ్చేదయితే ఇంకా మంచిది. ఇవన్నీ చవకగా రావాలంటే పెళ్లొకటేమార్గం.

అందుకని నీలిని రెండువేపుల ఖర్చు భరించి తను పెళ్లి చేసుకొంటానన్నాడు. ముక్కుకి ముక్కుపుడక చెవులకి దిద్దులు కాళ్లకి కడియాలు పెడ్తానన్నాడు. తాళి బంగారందే కడ్తానన్నాడు.

నీలి కనీసం పది పదిహేనేళ్ల పాటు అతన్తో నిరాఘాటంగా కాపురం చెయ్యగలదని, ఈ లోపల దాని కడుపు కాయలు కాయకపోదని, కాయకపోయినా తిండి తిప్పలకి లోటుండదని సంబంధం తెచ్చినతను నీలి తల్లికి నచ్చచెప్పాడు. అతని తదనంతరం తన జీవితానికి ఏదో కొంత ఏర్పాటు చేయించగల తెలివి తేటలు నీలి చూపిస్తే చాలని, ఆ తెలివితేటలు అతను బతికున్న కాలంలో నీలి సంపాదించగలదని నీలి తల్లి నమ్మింది. ఈ సంబంధం కూడా కాదనుకొంటే నీలి రత్తాల్లాగా లేచి పోవటం ఖాయమని నీలి తల్లి భయపడింది.

నీలికాసంబంధం నచ్చలేదు. కాని పెళ్లి జరిగిపోయింది. నీలి కొత్త పెళ్లి కూతురులాగా కాక జీవచ్ఛవంలాగా ఊరు ఏగింది.

నీలి వయస్సు ఆమె భర్తకి ఇంపుగా కనిపించింది. భర్త వయస్సు నీలికి ఏవగింపు కలిగించింది. పదిహేనేళ్ల అమ్మాయి యాభై ఏళ్ల వాడిని అతని డబ్బు చూసో, హోదా చూసో గట్టి వళ్లు చూసో ఏదో ఒక కారణంగా ఇష్టపడితే ముదిమి కూడా ముచ్చటే అవుతుంది. కాని నీలికి తన భర్తలో ఏ గొప్పతనమూ కనిపించలేదు. కాపురానికి వెళ్లాక ఇంటి పనంతా ఇల్లాలుగా చక్కగానే చేసేది కాని దాంపత్యం విషయంలో భర్తతో సహకరించేది కాదు. సహకరించే స్త్రీని సంతృప్తి పరిచే నేర్పు అతనికి లేక పోలేదు కాని బలాత్కారంగా లొంగదీసుకొనే పటుత్వం అతనికి లేకపోయింది. అతను మొదటి రాత్రి భంగపడ్డాడు. ఆ కార్యం ఇద్దరికి బావుంటుదని వివరించి ఒక అవకాశం ఇచ్చి

చూడమని ముద్దుగా బతిమిలాడాడు. నీలి పెద ముఖం పెట్టింది.

నీలికాసుఖం పట్ల కోర్కె లేక కాదు. ఆమె సినిమాలు చాలానే చూసింది. పెళ్లియిన ఆడవారి నుంచి చాలానే వింది. కాని ఆ పనికి జతగాడుగా తన తండ్రి వయస్సు వాడిని ఊహించుకోలేకపోయింది. భర్త బెంగ పెట్టుకొన్నా చేసేదేమి లేక, చెప్పుకొనేందుకులేక మంచి రోజుకోసం ఎదురుచూడసాగాడు.

ఓ రోజు ఊళ్లో ఎవరో పోయారు. ఆ పని మీద శ్మశానానికి వెళ్తూ నీలి భర్త తనా రోజు ఆలస్యంగా ఇంటికి వస్తానని నీలితో చెప్పివెళ్లాడు.

నీలి ఊళ్లో చెరువులో స్నానం చేసి బిందెలో నీళ్లు మోసుకువచ్చింది. తలుపు జేరవేసి తడి బట్టలువిప్పి బట్టలు కట్టుకోబోతూ తీర్చిదిద్దినట్టున్న తన శరీరాన్ని తను చూసుకుంది. ఆపైన తనంత చిన్నదానికి, అన్ని అందాలు ఉన్న దానికి పెద్ద వయస్సు భర్త రావటంలో ఏదో అన్యాయం ఉందనిపించి ధుఃఖం వచ్చింది. ఆమె కళ్లల్లో నీళ్లు బికాయి.

ఆ సమయంలో నీలి ఊరినుంచి ఓ పట్నాయక్ నీలి భర్తతో పనుండి అతనింటికి వచ్చాడు. పిలిచాడు.

"అతనింట్లో లేడు ఇప్పుడేరాడు" అని నీలి లోపల నుంచి సమాధానం ఇచ్చింది.

ఇంట్లో నీలుండటం గమనించి, 'వచ్చింది నేను నీలమ్మా" అంటూ పట్నాయక్ తలుపు తోసాడు తన ముఖం చూస్తే ఆమె గుర్తుపడ్తుంది కదా అని.

భర్తకి సుఖం ఇవ్వటం మొదలు పెట్టాక నీలికి అపరాధ భావం పోయింది. భర్తకి సరిపడేలా అతనికి కావలసింది తను అందజేస్తోంది. తనకే అతనిచ్చేది చాలడంలేదు. అందువల్ల తను పట్నాయక్‌తో సంబంధం కొనసాగిస్తోంది" అసలు పెళ్ళంటూ ఒకటి నోకంలో ఉండటమే ఇల్లాంటి తప్పులకు కారణం ఏమో!" అని ఆలోచించింది నీలి.

తలుపు చప్పుడుకి నీలి కంగారు పడి ఎల్లా ఉన్నదల్లా బిగుసుకుపోయింది. అప్పటికామె చీర సగమే కట్టుకొంది. పట్నాయక్ తను చూస్తున్నది నల్లరాతి బొమ్మ అని భ్రమ కలిగింది. చూస్తూ నోటమాట లేక నిలబడిపోయాడు.

"లేడు. అతను లేడు" అంది నీలి కంగారుగా మరోసారి. పట్నాయక్‌కి ఆ మాటలతో చలనం వచ్చింది. అతని పాతికేళ్ల యవ్వనానికి ఆపుకోలేని ఉద్రేకం వచ్చింది. లోపలికి వచ్చి నీలిని గట్టిగా వాటేసుకొన్నాడు.

నీలి "తప్పు" అంటూనే ఆ యువకుడి ఉద్రేకానికి అడ్డుపడలేని అశక్తతకి లోనైంది. పట్నాయక్ కండలు తిరిగిన వళ్లు జులపాల జుట్టు ఆమెను వివశం చేసి పరవశం చేసాయి. రెండు కొండల్ని ఒక పోటేలు యిసక పర్రల మీద ఒకేసారి ఢీకొన్నట్టు పట్నాయక్ నీలి మీద కలబడిపోయాడు. ఉవ్వెత్తున లేచిన కెరటం కిందనున్న నేల మీద పరచు కొంది. నేలని ఆర్ద్రత అలముకొంది.

అలసిపోయిన పట్నాయక్‌కి టీకాచి ఇచ్చింది నీలి. టీ తాగిన పట్నాయక్ 'మళ్లీ వస్తాను" అంటూ బయటికి నడిచాడు.

మళ్లీ వచ్చేది తన కోసమా? తన భర్తకోసమా? అన్న సందేహంలో పడిపోయింది నీలి.

పట్నాయక్ మరోసారి వచ్చినప్పుడు నీలికి అతను తన కోసమే వచ్చినట్టు అర్థమైంది. నీలి భర్త పశువులకి అమ్మకాలలో దళారి పని చేస్తూ ఉంటాడు. ఆ పని మీద అతన్ని పంపి అతను లేని సమయంలో పట్నాయక్ నీలిని కలిసాడు. ఈ సారి తిలకం సీసా, పౌడరు డబ్బాలాంటి చిన్న చిన్న బహుమానాలు లడ్డూలు జాంగ్రీలు లాంటి తిళ్లూ తీసుకువచ్చాడు. నీలి అవి పుట్టింటి నుంచి వచ్చాయని భర్త దగ్గర బొంకింది.

నీలికి పట్నాయక్ వచ్చిన రోజు పండుగ. పట్నా యక్‌తో మూడు సార్లు కలిసేసరికి నీలికి భర్త మీద ఏవగింపు తగ్గిపోయింది. ఈ చాటుమాటు వ్యవహారం నడపాల్సిన పరిస్థితి మీద మాత్రం కొంత చికాకు మిగిలిపోయింది ఆమెలో.

కాని ఇప్పుడు నీలి కూనిరాగాలు తీస్తోంది. కొప్పులో పూలు ముడుస్తోంది. కళ్లకి కాటుక పెట్టుకొంటోంది. ఓ రాత్రి నీలి భర్త ఆమెకి భర్త పట్ల ఆమెకున్న విధుల గురించి చెప్తూ,

"అతనికి వండివార్చాలా, సేవలు సెయ్యాల, మనసు పడినప్పుడు అతని పక్కన తొంగోవాల . . . " అంటూ చెప్తుంటే

"నానుప్పుడు వద్దన్నా నేటి!' అంది నీలి. అప్పటికే తనకిక తాళికట్టి అన్నం పెడ్తున్న భర్తకి తన దేహం మీద కోర్కె కాకుండా అధికారం కూడా ఉండవచ్చునన్న విషయం నీలి ఒప్పుకోగలుగుతోంది.

నీలి భర్త ఆ మాటలకి తబ్బిబ్బయిపోయి 'ఏటేటె నిన్న మొన్నటి దాకా దూరంగా నెట్టేసేదానివి" అన్నాడు.


"అప్పుడంటే కొత్త" అంది నీలి.

ఆ రాత్రి నీలి ఆమె భర్తకి అన్ని విధాలా సహకరించి సంతోషపెట్టింది. తను మనస్సుపెడ్తే యాభైఏళ్ల భర్తతో కూడా

సుఖపడవచ్చునని గుర్తించింది. పట్నాయక్ హోరెత్తే జలపాతం. భర్త నిండుగా పారేనది. మొదటి రాత్రి తన భర్త తనని బలి మిని లొంగదీసుకొని ఉంటే తను పట్నాయక్ కేసి కన్నెత్తి కూడా చూసేది కాదేమోనన్న అనుమానం కలిగింది నీలికి. భర్త భంగపాటు కూడా అతనంటే తనకి చిన్న చూపు కలగటానికి కారణంగా గుర్తించింది.

భర్తకి సుఖం ఇవ్వటం మొదలు పెట్టాక నీలికి అపరాధ భావం పోయింది. భర్తకి సరిపడేలా అతనికి కావలసింది తను అందజేస్తోంది. తనకే అతనిచ్చేది చాలడం లేదు. అందువల్ల తను పట్నాయక్‌తో సంబంధం కొనసాగిస్తోంది "అసలు పెళ్లంటూ ఒకటి నోకంలో ఉండటమే ఇల్లాంటి తప్పులకు కారణం ఏమో!" అని ఆలోచించింది నీలి.

పట్నాయక్ రాకపోకడలు నీలిమీద కన్నేసిన కొందరి కంట పడ్డాయి. "మొగుడంటే మోజు లేనిదానా! నీకు మేము కూడా ఉన్నాం మోజు తీర్చడానికి" అంటూ నీలికి సూచన లిచ్చారు.




ప్రతివాడితోను పోయేందుకు తను గుడిసె చేటికాదు పట్నాయక్ అంటే ఎండిన నేల మీద పడిన వాన చినుకు అనుకొన్న నీలి వారికి పెడముఖం చూపింది. అందుకు కొందరు ఉడుక్కున్నారు. అటువంటివారిలో కొందరు నీలి భర్తకి "చేనుకి కంచె వేసుకొని కాపాడుకో" అని ఉచిత కుళ్లు బోతు సంహా ఇచ్చారు. కాని నీలి భర్త వీళ్ల కళ్లకే నీలి నదురుగా కనిపించి ప్రయత్నించి ఉంటారని సరిగా ఊహించాడు. వీళ్లు అందని మేని పళ్లు మీద అపనిందలు వేస్తున్నారని తప్పుగా ఊహించాడు.

అల్లా అనుకొన్నాక ఎందుకైనా మంచిదని నీలి భర్త నీలిని రైక తొడుక్కోడం మానెయ్యమన్నాడు. ఆ ఊళ్లో మగనా లులు రవికలు వేసుకోరు. వంటికి బట్టలు తొడిగిన కొద్ది వంటికి ఆకర్షణ పెరుగుతుందని "సానిపాపలు" మాత్రమే "రైకలు లంగాలు" కట్టి మగవాళ్ల నాకర్షించ చూస్తారని, క్షణం బట్ట తొలిగితే ఉండే ఆకర్షణ అసలు బట్టే లేనప్పుడుండదని నమ్ముతారు.

నీలి రవిక వేసుకోవడం మానేసింది. దాని వల్ల పట్నాయక్‌కి ఆకర్షణ ఏమీ తగ్గలేదు. "చక్కనమ్మ విప్పినా అందంగానే ఉంటుంది." అనేవాడు నవ్వుతూ. అతను వస్తూ పోతూ ఉండటం కొనసాగించాడు. ఒకసారి నీలి భర్త కంట పడనూ పడ్డాడు. అందరూ అంటున్న దాంట్లో కొంత నిజం ఉన్నట్టు అతను గుర్తించి, నీలిని జరిగిపోయినదేదో జరిగిపోయిందని ఇక ముందు బుద్ధిగా ఉండి తన పరువు కాపాడమని బతిమాలాడు. నీలి వినలేదు. బెదిరించాడు. నీలి వినలేదు.

"నాను నీకిమాతరం సేరువయ్యానంటే అతనే కారనం. నాన్నీ కోపిసరైన సుకమిస్తున్నానంటే అతనే కారనం. అతనే నీకో దారి సూపాడు" అని నిర్భయంగా నిజం చెప్పింది.

నీలి మొగుడికి నోరు పెగల లేదు. నీలికి భర్త మీద జాలేసింది.

ఆ తరువాత నీలి పట్నాయక్‌లు ఎవరికంటా పడకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోసాగారు. దానికే ఆమె మొగుడు సంతోషించాడు.

ఇల్లా కొద్ది కాలం జరిగే సరికి నీలి నీళ్లు పోసుకొంది. నీలి తన జీవితానికో అర్థం ఆధారం ఏర్పడ్డాయని సంతోషించింది.

"ఆ బిడ్డ నాదో! ఆడ్డో!" అని ఆమె భర్త అనుమానం వెలిబుచ్చాడు.

"నీ బిడ్డే" అంది నీలి.

"నీ రంకు మొగుడు బిడ్డని నా డబ్బుతో సాకడానికి నేనేమంత వెర్రోణ్ణిగాను" అన్నాడా భర్త. భార్య రంకుతనాన్ని భరించటం కంటే మరొకడి సంతానాన్ని తన సంతానంగా స్వీకరించటం కష్టమని ఆ మాటల్తో తెలియజెప్పాడు . . . తనకి తెలిసిన విధంగా పితృస్వామిక వ్యవస్థ లక్ష్యాన్ని వివరించాడు. పట్నాయక్‌కి శుభవార్త తెలిపింది.

"కచ్చితంగా ఇది అతని బిడ్డే. నాది కాదు. నాకు తెలుసు" అన్నాడు పట్నాయక్.

జనకుడి రాజ్యంలో నాగేటి చాలులో దొరికిన పెట్టె విషయంలో "నీదం"టె "నీద"ని తగువు పడ్డారని ఆ రోజులు అంతధర్మంగా ఉండేవని చెప్తారు. ఈ రోజుల్లో కూడా నీలి భర్త, పట్నాయక్ కూడా నీలి కడుపులోని శిశువు "నాది కాదు" అంటే "నాది కాదు" అనగలిగారు.

"నాతో ఉండాలంటే కడుపు తీయించుకోవాల్నువ్వు" అన్నాడు నీలి భర్త.

"పోనీ తీయించేసుకో" అన్నాడు పట్నాయక్. నీలి కడుపులో శిశువును కాపాడుకోలేకపోయింది. నీలి మీద భర్త అధికారం చెల్లకపోయినా ఆ శిశువు విషయంలో ఆమె భర్త అధికారమే చెల్లింది.

గర్భస్రావం వల్ల కలిగిన నీరసం నుంచి నీలి బయట పడేసరికి ఓ నెల పట్టింది. ఈ నెలరోజులు నీలి ఇటు భర్తని అటు పట్నాయక్‌ని కూడా తన వంటి మీద చెయ్యి వెయ్యనీయ

లేదు. ఈనెలలో నీలి చాలా ఆలోచించుకుంది. ఇక ముందు భర్తనో, పట్నాయక్‌నో ఒకర్నే నమ్ముకుని అతని ద్వారా తల్లి కావాలని తన జీవితంలో ఇద్దరున్నంత కాలం తనని తల్లి కానీరనుకొంది. ఇద్దరిలో ఒకర్నెంచుకోవాల్సిన పరిస్థితిలో ముందరి అవకాశం పడుచువాడైన పట్నాయక్‌కే ఇవ్వదలచుకొంది.

"నాన్నీకు కావాలంటే నన్ను నెగదీసుకొనిపోయి ఇంకో ఊళ్లో కాపురమెట్టు" అంది పట్నాయక్‌తో.

నీలిని తన ఊరు తీసుకువెళ్లి కాపురం పెట్టే ధైర్యం పట్నాయక్‌కి లేదు. ఆ ఊళ్లో అతనికి భార్యపిల్లలూ అత్తమామలు ఉన్నారు. భార్య అత్తమామలు రాక్షసులు. పట్నాయక్ లీలలు వాళ్లకి చూచాయిగా తెలుసు. కాని నీలి మగనాలి కనక ఎప్పుడో నీలిభర్త ఊళ్లో వాళ్ల పట్నాయక్‌ని బెదిరించో, కనీసం నీలిభర్త నీలిని నాలుగు తన్నో ఈ సంబంధం తెంచేస్తారని వాళ్లు లౌక్యంగా ఎదురుచూస్తూ నోరు విప్పలేదు. పట్నాయక్ నీలి మీద ఏమీ కర్చు పెట్టడం లేదు కనక అతని భార్య ఊరుకొంది కాని నిప్పుని తెచ్చి తన కొంగునముడేస్తుంటే చూస్తూ ఊరుకోదు.

పట్నాయక్‌కి ఇవన్నీ తెలుసు. కాని నీలి అందమైనది. తనకింకా మోజు తీరలేదు. తను పన్ల మీద వొయిజాగ్ వెళ్తూ ఉంటాడు కనక నీలితో విశాఖపట్నంలో కాపురం పెట్టవచ్చు. అక్కడయితే తన భార్యకి తెలియకుండా కాపురం వెలగబెట్టవచ్చు. పట్నంలో తనూ నీలి భార్యా భర్తలమని చుట్టుపట్ల వారికి చెప్పవచ్చు. ఇంత దూరం ఆలోచించి, నీలిని వంటి మీది బంగారంతో సంచిలోని బట్టల్తో లేవదీసుకుపోయి పట్నంలో కొత్తగా లేస్తున్న కాలనీ పక్కన ఇళ్లు కట్టే పనివారు వేసుకొన్న పాకలాంటిదే ఒకటి అద్దెకి తీసుకొని, కిరిసిను నూనెస్టొవ్వు, సంబారాలు, చాపా పరుపు దిళ్లు కొని కాపురం పెట్టేసాడు. "పట్నం ఆడోళ్లంతా రైకలేసుకొంటారు" అంటూ ఆమె చేత రవిక తొడిగించాడు. పోషిస్తున్నవాడు "విప్పాల" అంటే నీలి విప్పింది. "తొడగాల" అంటే తొడిగింది.

పట్నాయక్ రెండు నెలల పాటు నీలితో జల్సాలు చేసాడు. సినిమాలు చూపించాడు. "ఒర్నాయనో! ఎంత పెద్ద హాళ్లో! మనూళ్లో టెంటు సినిమాలకంటే ఇయి బావున్నాయి" అని సంబరపడింది నీలి. సముద్రపొద్దుకు తీసుకువెళ్లాడు. మిరపకాయ బజ్జీలు కొనిపెట్టాడు. "అవతలొడ్డు కానరావటంనేదు. ఎన్నోటి నీళ్లో" అని ఆశ్చర్యపోయింది.

* * *

రత్తాలుని లేపుకువెళ్లిన సింహచలం ఈ గొడ్డు ఓసుట్టయినా దెబ్బతిన్న గొడ్డుకాదని దానిమీద కనీసం తను సెయ్యియినా ఎయ్యలేదని సెప్పి నర్సమ్మ కంపెనీకి రత్తాల్ని అమ్మేసాడు. రాంబాబు రత్తాల్ని బంగారప్ప మనుష్యలనుంచి ఓసారి కాపాడాడు. రాంబాబు అప్పటికే అయ్యేయస్ పరీక్షలు వ్రాసి ఏక్షణాన్నైనా చిన్న కలెక్టర్ అవటానికి సిద్ధంగా ఉన్నాడు.

## 2

ఇప్పుడు రత్తాలు నీలి ఒకే ఊళ్లో ఉన్నారు. పోతే ఒకరి కబురురొకరికి తెలియదు.

పట్నాయక్‌కి స్వంత ఊళ్లో పెళ్లాం పిల్లలు అత్తమామలేకాక భూములున్నాయి. వాటికి సంబంధించిన పను లున్నాయి. అందుకని విశాఖపట్నంలో ఎక్కువరోజులు స్వంత ఊళ్లో తక్కువ రోజులు ఉంటూవచ్చిన పట్నాయక్ కొద్ది నెలలు గడిచేసరికి స్వంత ఊళ్లో పెళ్లాం దగ్గర ఎక్కువ రోజులు, నీలి దగ్గర తక్కువ రోజులు ఉంటూ వచ్చాడు. కాని వచ్చినప్పుడల్లా అమ్మకానికి తెచ్చిన బియ్యం, కందిపప్పు, చింతపండు, వేరుశనగ మొదలైన దినుసుల్లో కొంత భాగం నీలి ఇంట్లో పడేసేవాడు. భార్యతో ధర తక్కువ చేసి చెప్పేవాడు.

పట్నాయక్ ఊళ్లో లేని రోజుల్లో నీలికి కొద్దిగా డబ్బు ఇచ్చి వెళ్తూ ఉండేవాడు. ఆ డబ్బులో నీలి జాగ్రత్తగా అవసరాలు గడుపు కొనేది. బజారులో ఓ రోజు నీలి ఊరికి చెందిన తురక పిల్లాడు సుభాను కనిపించాడు నీలికి. అతను ఊరు వదిలి కొన్ని సంవత్సరాలవటం వల్ల అతనికి ఊరి విషయాలేవి తెలియవు. అందుకని నీలి ధైర్యంగా తనని పట్నాయక్ పెళ్లి చేసుకొని ఆ ఊరు తీసుకువచ్చినట్టుగా సుభాన్‌తోచెప్పింది.

అయితే నీలి నెలకి చాలా రోజులు వంటరిగా ఉంటోందన్నమాట అనుకున్నాడు. పాపం తోచుబడి అవుతోందో లేదో అనుకొని అడిగి లేదని తెలుసుకొన్నాడు.

అప్పుడు తనకి పని చేసే ఇంటి యజమానురాలి తల్లి ఓ పనిమనిషిని చూసిపెట్టమని అడగటం గుర్తుకు వచ్చింది.

"చంద్ర శేఖరం మేస్టారి భార్య పనిమనిషి కావాలంది. పని చేస్తావేటి? నీకు కాస్త తోచుబడి అవుద్ది. చేతిలో కాసిని డబ్బులూ పడ్తాయి" అన్నాడు సుభాను.

"ఇంకోల్లింటో పాచిపని సెయ్యాటేమేంటి అసయ్యంగా" అనుకొంది. పట్నాయక్ ఏటంటాడా అని బయపడింది. తన కులపోల్లని ఇంటోకి రానిత్తరా? అని అనుమానపడింది. తురకోడ్నే రానీగా లేంది తనని రానీరా అయినా పట్నం పోల్లకి జాతి పట్టు తక్కువ అని ధైర్యం తెచ్చుకుంది. పట్నాయక్ వచ్చాక అడిగి చెప్తానంది నీలి సుభానుతో. సుభానుకి తన ఇల్లు ఎక్కడో చెప్పి అతను పన్చేస్తున్న ఇల్లు గుర్తులడిగి తెల్సుకొంది.

మరో అయిదు రోజులకి అంటే నీలిని విడిచి వెళ్లిన పదిహేనురోజులకి పట్నాయక్ వచ్చాడు.

నీలి పట్నాయక్‌కి సుభాను తనని కలవడం గురించి తను పని చెయ్యటం గురించిన సలహా గురించి చెప్పి "ఉప్పుడే నాలుగు డబ్బులు వెనకేసుకొంటే పిల్లలు పుట్టినప్పుడు ఆసరాకొస్తాయి" అంది నీలి.

"అద్ని తగులు కొన్నావేటి" అని చిన్న అనుమానం వెలిబుచ్చాడు. తనతో నీలి వచ్చిన రోజే నీలి తన్ని విడిచి

మరొకడితో కూడా అంతే సులభంగా వెళ్లిపోగలదు అన్న తేలిక అభిప్రాయం పట్నాయక్ ఏర్పరుచుకొన్నాడు. నీలి దెబ్బ తిన్న పక్షిలా చూసింది. పట్నాయక్ తను ఆ మాటలు హాస్యాని కన్నానన్నాడు.

"నీ కిట్టమైతే పన్లో జేరిపో. కాని మనకి పిల్లలు పుట్రు నాకాపరేసన్ అయిపోయింది" అని చాలా సులువుగా సాధారణమైన విషయం చెప్తున్నట్టు చెప్పాడు పట్నాయక్.

నీలికి కడుపు వచ్చినప్పుడు నీ కడుపులోది నా బిడ్డ కాదన్నాడేగాని తనకాపరేషన్ అయినట్లు చెప్పలేదు. విశాఖపట్నం బయల్దేరే రోజు ముందు పట్నాయక్ వల్ల తనకి సంతాన ప్రాప్తి లేదని తెలిస్తే మాతృత్వాన్ని వాంఛించిన నీలి భర్తతోనే ఉండిపోయేది.

పట్నాయక్ మాటలు నీలిని బాగా కలచివేసాయి. పట్నాయక్‌కి తన మీద మనసు లేదు, తన దేహం మీదే మనసు అని తెలియగానే నీలి మనసులో పట్నాయక్ పట్ల ప్రేమ ఇంకిపోయింది. నీలినోట మాట లేకుండా నిలబడిపోయింది.

తన పెళ్లాం లంకిణి. తను విశాఖపట్నంలో ఉంటే అనుమానపడ్తుంది. అనుమానం వస్తే తనని కాల్చుకు తినేయగల సమర్థురాలు. నీలిని ఇక్కడ వంటరిగా వదిలేస్తే ఎవడైనా మరిగినా మరుగుతుంది. తన నీలిని ఇతర్ల నుండి కాపాడుకోడానికి నీలికి రక్షణ ఇచ్చే ఆశ్రయం అవసరం అని ఆలోచించి.

"అరింట్లో పనికి కుదిరిపో. అదే మంచిది" అని అనుమతిచ్చేసాడు.

నీలి చంద్రశేఖరం మేస్టారింట్లో పనికి కుదిరింది. ఇంట్లో ఆయనా, ఆయన తల్లి, భార్యా, కొడుకు మొత్తం నలుగురు జనం. సుభానుకాయింట్లో మంచి పేరుంది. మా ఊరిపిల్లంటూ సుభాను తీసుకువెళ్లటంతో ఏ అనుమానాల్లేకుండా నీలిని పన్లో పెట్టుకొన్నారు.

నీలి కష్టపడి పన్చేసేది. ఆ ఇంట్లో కొండంత పనుండేది. అంత వరకు ఏ పనిమనిషి అంత వరకు నిలబడి పని చేయలేదు. నెల తిరిగే సరికి మేష్టారి భార్య పార్వతమ్మ పాతిక రూపాయల జీతం ఓ పాత చీర ఇచ్చింది. ఆ రోజుల్లో కిలో మంచి బియ్యం రెండు రూపాయలే నీలి దానికే సంబరపడిపోయింది. పార్వతమ్మ చూపించిన అప్యాయతకు నీలి కరిగిపాయింది. పట్నాయక్ లాంటి మృగాన్ని నమ్ముకోటం కంటె చెరువు లాంటి పార్వతమ్మని నమ్ముకోటం నయం అనుకొంది నీలి.

*  *  *

రత్తాలు ముండల కంపెనీ నుంచి చెడకుండా తప్పించుకోగలిగింది అదృష్టం కొద్దీ. రాంబాబుకి తెలిసిన వాళ్ల ఆయాగా కుదిరింది. ఆ ఇంటి కట్టూ బొట్టూ మాటా మంతీ నేర్పింది. అసలే పచ్చటి పసిడి పువ్వు దానికి తావి అబ్బింది. ఏ గొప్పింటి వాడో నిరాక్షపణీయంగా పెళ్లి చేసుకోగలిగినట్టు తయారైంది.

*  *  *

కొద్దినెలలు గడిచేసరికి పట్నాయక్ భార్యకి విశాఖపట్నంలో పట్నాయక్‌కి ఉన్న ముఖ్యమైన పని గురించిన భోగట్టా అందిపోయింది. అయిదు మూటలు పట్టుకువెళ్లి నాలుగు మూటలు ధరే తెచ్చి ధరలు పడిపోయాయి అని పట్నాయక్ చెప్తుంటే నమ్మడం మానేసి అతని మీద కట్టడులు పెంచేసింది. మగాడు పలుపు తెంపుకుపోడానికి ప్రయత్నించే పసువులాంటి వాడు. అటువంటి మగాడికి ఆడది అవకాశం ఇస్తే అది ఆమె తప్పు అని నమ్మేమనిషి పట్నాయక్ భార్య. దాని వల్ల పట్నాయక్‌కి ఒకో నెల ఓసారైన విశాఖపట్నం వెళ్లటం పడేది కాదు. తోడుగా ఊరు మనిషి మరొడున్నప్పుడే పంపసాగింది. తోడు వచ్చిన వాడిని మంచి చేసుకొనో, మస్కాకొట్టో పట్నాయక్ నీలిని చూడాల్సి వచ్చేది. పట్నాయక్‌కి తను భార్యనో నీలినో విడిచి పెట్టాల్సి వస్తుందని త్వరలోనే అర్థమైంది. అది భార్య కాదని కూడా అతనికి తెలుసు.

నీలికర్థమైపోయింది. పట్నాయక్ తనని కట్టుకొని పడి ఉండేవాడు కాదు. తెంచుకొని పారిపోయేవాడు. మేస్టారింట్లో పనికి చేరటం మంచిదే అయింది. ఆ అమ్మ తినటానికి ఏదో పెడ్తుంది. తనకి వచ్చే జీతంలో పది రూపాయలు అద్దెకి పోయినా పదిహేను రూపాయలు మిగుల్తున్నాయి. కాని అన్ని అవసరాలకి సరిపోవు. అందుకని నీలి పొద్దున్నే పంతులింట్లో ముందు ముగ్గు వెయ్యటం రాత్రి వండిపెట్టడం చెయ్యటానికి కుదురుకుంది.

పంతులిల్లు నీలి ఇంటికి దగ్గరే. పంతులు ఓ చిన్న బడి పంతులు. ఆ పంతులు ఓ పడిపోతున్న ఇంట్లో అతి తక్కువ అద్దెకి ఉంటున్నాడు. ఆ ఇంటి వాళ్లు ఆ ఇంటి కాపలా కోసం అతనికి అతి తక్కువ అద్దెకి ఆ ఇంటిని అతనికద్దెకిచ్చారు. వాళ్లకి రియల్ ఎస్టేటులో డబ్బులు చేసుకోడం తెలుసు. పంతులు గడ్డం ఎప్పుడూ అతని పంచెలా మాసే ఉంటుంది. వీపు మీద జంధ్యం ఉంది కనక అందరూ అతన్ని పంతులంటారు. అతనికెవ్వరూ లేరు. అతనింటికి ఎవ్వరూ రారు. నీలి చేతి వంట తినటం వల్ల అతన్ని వెలివేసేవారెవ్వరూ లేరు. ఆ చుట్టు పట్ల వాళ్ల దృష్టిలో ఆ బామ్మరుడు వాళ్ల మధ్య నివసించడానికి వచ్చినప్పుడే భ్రష్టుడయ్యారు.

పంతులు తిన్నాక నీలి వచ్చి అడుగులు బొడుగులు తను తిని గిన్నెలు తోమి బోర్లించి వెళ్తుంది.

ఆ సమయంలో చంద్రశేఖరం మేస్టారి మరదలు గర్భసంచి తీయించుకొంటె సాయానికి మేస్టారి భార్య రాజమండ్రి వెళ్లింది. అది వేసవి కాలం. మేస్టారు కూడా పన్ల మీద ఊరు వదిలి తిరుగుతున్నారు. ఇంట్లో మిగిలింది అతని తల్లీ కొడుకు శ్యామ్. శ్యామ్ కాలేజీలు తెరిస్తే బియ్యే చివరి సంవత్సరంలోకి వస్తాడు.

నీలి మామూలుగ పని చేయటానికి వస్తోంది. శ్యామ్ ఆమెను మామూలుగా చూస్తున్నాడు. ఓ రోజు శ్యామ్ స్నేహితుడు వచ్చి నీలిని చూసి

"మీ పనిమనిషి గొప్పగా ఉంది గురూ ఇంత లేసి..." అంటూ చేతుల్తో ఆమె ఎత్తులూ వెడల్పులూ చూపించాడు.

దాంతో శ్యామ్‌కి అర్థమైంది. తనిన్నాళ్లు ఇంట్లో అందమైన పిల్లని పెట్టుకొని మూర్ఖంగా అందాలు చూడాటానికి బీచ్‌కి వెళ్తున్నాడని. అప్పటి నుంచి శ్యామ్ నీలి తనింట్లో పనిచేసే సమయానికి ఇంట్లో ఉంటున్నాడు. ఇల్లు దగ్గరుండి తుడిపిస్తున్నాడు.

శ్యామ్ అప్పటికే పెద్దన వర్ణించిన పాలిండ్ల గురించి, శ్రీనాధుడు వర్ణించిన గబ్బి గుబ్బలు గురించి, ఇంగ్లీషు రచయితలు డిస్క్రైబ్ చేసిన ఐవరీ బ్రెస్టెస్ గురించి చదివి ఉన్నాడు. అతన్ని స్తనాలు ఆకర్షించినట్టుగా ప్రపంచంలో మరేది ఆకర్షించడం లేదు. అతనికి పందొమ్మిదేళ్ళు. నీలి వంగుని వూడుస్తుంటే అతని చూపులతో వెంటాడేవాడు.

ఒకరోజు నీలి పార్వతమ్మ ఇచ్చిన రవిక తొడుక్కుని వచ్చింది. పార్వతమ్మ స్థూల కాయురాలు. అందుకని అందులో నీలేకాక మరో రెండు చేతులు పట్టేఅంత వదులుగా ఉంది ఆ రవిక. నీలి ఊడుస్తున్నప్పుడు ఆ కారణంగా ఆమె పాలిండ్లు ఆమూలాగ్రం శ్యామ్‌కి కనిపించాయి. వాటిని అందుకోవాలన్న కోర్కె అతనికి ఉధృతంగా కలిగింది.

తలెత్తి చూసిన నీలికి అతని కళ్లలో కాంక్ష కొట్ట వచ్చినట్టు కనిపించింది. నీలికి ఆ క్షణంలో చిన్న గర్వం కలిగింది. తను సదువుకొంటున్న బాబుని అందులోను ఎర్రగా బుర్రగా అందంగా ఉన్న బాబుని ఆకర్షించగలిగింది! శ్యామ్, నీలి చీర పైకి ఎత్తి దోపు కున్నప్పుడు, ముందు వేళ్లాడ్తున్న జడని ఒక కుదుపుతో వెనక్కి వేసుకొన్నప్పుడు పెరట్లో పూలు తల్లో పెట్టుకొన్నప్పుడు, అద్దంలో తన బొమ్మ చూసుకొంటున్నప్పుడు, ఆరాధనతో చూసేవాడు. అటువంటప్పుడు ఎప్పుడైనా నీలి ఓ చిరునవ్వు నవ్వేది.

శ్యామ్‌కి నీలెంత నచ్చిందో ముసలామెకి అంత నచ్చ లేదు. నీలి తిప్పులాడి అనుకొంది. పూట పూట అన్నం పెట్టడానికి ఒప్పందం లేదని చెప్పి అన్నం మిగలకుండా వండేది చేతైనంత వరకు మిగిల్తే మాత్రం నీలికి పెట్టేది. మరుసటి పూట తను తినదు మనవడికి పెట్టదు కనుక.

నీలికి నీరసం మీద జ్వరం వచ్చి మూడు రోజులు పనిలోకి రాలేదు. పనిలోకి మూడ్రోజుల తరువాత వచ్చినా ఆ పూట నీరసంతో సరిగా చేయలేక ముసలామె చేత తిట్లు తింది.

ఒంట్లో నీరసం, అకలి నీరసం. ఆ నీరసంతో పని చేయాల్సిరావటం చెయ్యలేక తిట్లు తినాల్సి రావటం, పట్నాయక్ ఎప్పుడు వస్తాడో తెలియకపోవటం - వీటన్నిటి వల్ల నీలి, శ్యామ్ తన వెంట ముసలామెకి దూరంగా ఉన్న గదిలోకి వచ్చినప్పుడు,

"అబ్బాయిగారూ! రెండ్రూపాయలుంటే ఇప్పించండి" అని అడిగింది.

శ్యామ్ కంగారు పడి, "జీతం లోదా?" అని అడిగాడు. జీతంలోదైతే మామ్మనడిగి ఇవ్వవచ్చు.

నీలి నవ్వి, "మీ దగ్గర్నేవా?" అని అడిగింది. అడుగుతూ పమిటి ఓసారి దులిపి సరిగా వేసుకొంది. ఈసారి శ్యామ్ చలించలేదు.

అతని దగ్గర రెండ్రూపాయలు సినిమా కోసం దాచుకొన్నవి ఉన్నాయి. కాని రెండే ఉన్నాయి. నాలుగు లేవు. అవి నీలికి ఉత్తినే ఇవ్వలేడు. ఏదైనా అనుభవానికి బదులుగా అయితే సినిమాని త్యాగం చెయ్యగలడు. కాని ముసలామె వెయ్యి కళ్లతో ఇంటిని ఇన్‌స్పెక్ట్ చేస్తూనే ఉంటుంది. ఏ క్షణం వచ్చినా రావచ్చును. మధ్యలో వస్తే తను దొరికిపోతే ఆమె నీలిని పనిమాన్పించిగాని ఊరుకోదు. తన ఘనకార్యం తల్లిదండ్రులకి రిపోర్టిస్తుంది. అప్పుడు జరిగేది తల్చుకోడానికే శ్యామ్‌కి భయం

'ఆహ్వానం' పత్రికకు ఈ ఏప్రిల్ మాసానికి మూడు సంవత్సరాలు నిండి నాలుగవ సంవత్సరం వస్తుంది. ఈ సందర్భంగా ఏప్రిల్ సంచిక జన్మదిన సంచికగా వెలువడుతుంది. ఈ సంచికకు పత్రిక శ్రేయోభిలాషులైన పాఠక మిత్రుల్ని 'ప్రకటనలు' సేకరించమని మనవి చేస్తున్నాం. ఇందుకు అవకాశం ఉన్న వారిని ప్రయత్నించమని కోరుతున్నాం. ప్రయత్నించదలచిన వారు పత్రిక ప్రకటన రేట్లు, మిగతా వివరాలు కావాలంటే పత్రిక కార్యాలయానికి రాసి తెప్పించుకోవచ్చు. ఆంధ్ర ప్రదేశ్ నలుమూలల గల 'ఆహ్వానం' పాఠకులు తమ పరిధిలో అవకాశం ఉన్నంతమేరకు ప్రకటనలు సేకరించి సహకరిస్తారని ఆశిస్తున్నాం. పత్రిక యాజమాన్యం వారి సహాయం కూడ తీసుకోవచ్చును. పత్రిక మనుగడకై మాతో పాటూ మిమ్మల్ని బాధ్యతల్ని పంచుకోమని మరీ, మరీ కోరుతున్నాం.

ఎడిటర్

వేసింది. అందుకని.

"లేవు ఒట్టు" అన్నాడు.

"జీతంలోదే మీ మామ్మతో సెప్పి ఇప్పించండి" అంది నీలి. ఆ ముసలది తనడిగితే ఇవ్వదని నీలికి తెలుసు.

నీలుకు ఈ పిరికి కుర్రవాడుత్త చూపులగొడ్డేనని అర్థం అయిపోయింది.

శ్యామ్ ముసలామెతో చెప్పాడు. ఆమె

"ఈనెల నాలుగు రోజులు పనికి రాలేదు. అంటే నీకు మూడు రూపాయలు నాగా కడ్తున్నాను. ఇప్పుడు రెండిస్తున్నాను. నెలచివర ఇరవయ్యే వస్తాయి" అంటూ దండకం చదివి రెండ్రూపాయలు చేతిలో పెట్టింది.

రెండ్రూపాయలతో రెండు రోజులు గడిచాయి. పంతులింట్లో తినే అన్నం వయస్సులో ఉన్న నీలికి చాలటం లేదు. పట్నాయక్ ఎప్పుడు వస్తాడో తెలియదు. నీలి దగ్గర డబ్బుల్లేవు. అటువంటి సమయంలో పంతులింటి నుంచి ఇంటికి బయల్దేరి మధ్యలో దూరంగా కనిపిస్తున్న గుట్టకేసి నడిచి దాని మీద కూర్చుని తన భవిష్యత్తు గురించి ఆలోచించుకోసాగింది.

"రాత్రి కెంత?" అన్నమాట ఆ నిర్జన ప్రదేశంలో హఠాత్తుగా వినపడేసరికి గాబరాపడి ఆ మాటలు వచ్చిన దిక్కు చూసి అడుగు తున్నదో మగాడని గుర్తించి అర్థమయి. "ఎంతేటి? వళ్లెలాగున్నదేమిటి" అని కోపంగాను గట్టిగాను అడిగింది. అడిగినవాడు భయస్థుడు. జారుకొన్నాడు. తను ఒకడికి కట్టుబడి 'ఉండే'దే కాని ఒకేసారి పదిమందితో పోయే వెలయాలు కాదు అనుకుంటూ లేచి ఇంటికి నడిచింది.

కాని ఆ సంఘటన వల్ల వయస్సులో ఉన్న స్త్రీకుండే ఏకైక గ్యారంటీ మార్గం ఏదో తెలిసిపోయింది. మరో రెండు రోజులు తరువాత ఆకలికి ఆ మార్గాన్ని ఆశ్రయించింది. అయితే రాత్రి తనతో గడిపిన మగాడు మర్నాడు పగలు తనని గుర్తుపట్టకుండా ఉండటానికి తీసుకోవల్సిన జాగ్రత్తలన్నీ తీసుకుంది. దాని ద్వారా పది రూపాయలు సంపాదించింది. డబ్బు. సుఖం కొనుక్కొనే వాడికి ముఖంతో పనుండదు కనుక నీలికే ఇబ్బంది కలుగలేదు.

* * *

## 3

కొన్ని రోజులు ఆ డబ్బుతో గడిపాక పార్వతమ్మ వచ్చింది. వర్షా కాలం వచ్చింది. నీలి కడుపు చల్లబడింది.

రాంబాబు కలెక్టరు పరీక్ష పాసై రత్తాల్ని పెళ్లాడాడు. రత్తాలిప్పుడు మిసెస్. రాంబాబు. ఆమెకి రాంబాబిప్పుడు ట్యూషన్ పెట్టి తెలుగు ఇంగ్లీషు నేర్పిస్తున్నాడు. తనకి వీలున్నప్పుడు అన్ని రకాల పాఠాలు నేర్పుతున్నాడు. రత్తాలు జీవితం ఇప్పుడు పూల బాటలో నడుస్తోంది. కానీ ఒటేలు మసి అంతా కడుక్కుని రత్తాలు రత్నంలా మెరిసిపోసాగింది.

నీలి జీవితమే ముళ్ల బాటన పడింది. నీలి నీతి అనుకొన్న దానిని ఒకసారి తప్పాక, ఒకసారి గీత దాటాక ఎన్ని సార్లైనా ఒకటే అయింది. మళ్లీ మళ్లీ దాటాల్సిన అవసరం, ధాటడానికి కావాల్సిన ధైర్యం వచ్చాయి. డబ్బు చేతిలో పడగానే పౌడర్లు పూసలు రిబ్బన్లు పువ్వులు లాంటి అవసరాలూ పెరిగాయి.

పార్వతమ్మ ఇంట్లోను పంతులింట్లోను మాత్రం నీలి విశ్వాసంగా పనిచేస్తోంది. కాని నీలి గురించిన కొన్ని పుకార్లు కొన్ని నిజాలతో కలిసి పార్వతమ్మ చెవిన పడసాగాయి. నిజం దేవుడికే తెలుసు అన్న ధోరణిలో పార్వతమ్మ నీలి పట్ల ప్రేమగానే ఉంటోంది. కాని అవే పుకార్లు ముసలామె చెవుల్లోనూ పడ్తున్నాయి. ఆమె నీలి కులం గురించిన వార్త కూడా వింది. ఆమెకు తక్కువ కులాల నీతి గురించి సదభిప్రాయం లేదు. అందుచేత అన్ని పుకార్లని నమ్మగలిగింది. నిజానిజాల ప్రసక్తి లేకుండా.

నీలి బావి నుంచి ఓ రోజున బిందెతో నీళ్లు తోడుతోంది. పరధ్యాన్నంగా తోడ్తుంటే బిందె రెండుసార్లు బావిగోడకి కొట్టుకొంది. శబ్దం ముసలామె చెవులపడనేపడింది.

"ఏమిటి వయ్యారాలు పోతూ నీళ్లు తోడ్తున్నావు? దాసీ దాన్ననుకొంటున్నావా? ఇంటి రాణివనుకుంటున్నావా?" అని ముసలామె నీలిని. కేకలేసింది. అందులో కోడలికి "జాగ్రత్త వయస్సు వచ్చిన కొడుకింట్లో ఉన్నాడు" అన్న హెచ్చరిక కూడా ఉంది.

నీలికి పౌరుషం పొడుచుకు వచ్చింది "యువరాణినే అనుకొంటున్నాను' అంది దాంతో.

"అసహ్యంగా ఏమిటా మాటలు" అంది పార్వతమ్మ ఆమె అత్తగార్నంటోందో. నీలి నంటోందో లేక ఇద్దర్నీ అంటోందో తెలియకుండా.

నీలి బిందెని తాడు నుంచి తప్పించి కింద పెట్టి.' "అమ్మా! ఆవిడ అనే మాట సరిగా అనుంటే తప్పైపోనాది, అమ్మా అనేదాన్నిపెద్దామె కదా! అంత లేసి మాటలనవచ్చా! తాగడానికి గుక్కెడు గంజి లేని దాన్ని. మొగుడ్నొదిలేసి. నేపుకొచ్చిన వాడిని నమ్ముకొని పారొచ్చి ఈ ఊర్లో నడిసంద్రంలో ముని గినదాన్ని నాకేటుందనమ్మా గర్వం. నేనే ఇంటికి రాణి నవాలని ఆసించడానికి నేను ఇస్యాసంలేని మడిసినా అయినా మీనాంటి సల్లని తల్లి కపకారం సేత్తానా?' అంటూ నూతి పళ్లెం మీద చతికిల బడి భోరున ఏడ్చింది.

శ్యామ్ ఇందంతా వింటూనే ఉన్నాడు. నీలిని అతని మామ్మ అంత మాటన్నందుకు. అందులో పిసరంత నిజం ఉన్నందుకు శ్యామ్ సిగ్గుపడ్డాడు.

" ఊర్కో! పెద్దావిడ ఏదో అందిలే! ఆవిడ మనస్సు మంచిదే! అయినా పెద్దవాళ్ల తిట్లు ఆశీర్వచనాలనుకోవాలి" అంటూ ఓదార్చి పార్వతమ్మ కాఫీని కలుపుకువచ్చి నీలికిచ్చి తాగనంటే ఊర్కోక బలవంతంగా తాగించింది.

అయితే నీలి తన బాధలో తను లేచి వచ్చిన

మనిషన్న నిజాన్ని బయట పెట్టేసుకుంది. ముసలామెకి మరో పాయింటు దొరికింది నీలిని పనిలోంచి మాన్పించెయ్యమని పోరు పెట్టడానికి.

నీలి రోడ్డు మీద లైటు కిందకి వచ్చేసరికి పక్కనుంచి ఒ కారు వెళ్లింది. అది కొంచేం ముందరకు వెళ్లి రివర్స్ చేసుకొంటూ నీలి దగ్గరికి వచ్చి ఆగింది. కార్లో నుంచి ఆ నువ్వు నీలివేనా?" అని రత్తాలు అడిగింది అనుమానంగా. నీలి అవునట్టు తలూపింది. రత్తాలు కారు దిగింది. నీలి గుర్తుపట్టింది రత్తాల్ని. కాని ఆ నువ్వు రత్తాలువేనా?" అని అడగలేకపోయింది.

"నేను రత్తాల్ని నీలి. నువ్వు నన్ను పోల్చలేదా?" అని అడిగింది రత్తాలు.

"పోల్తీ పట్టాను' అంది నీలి సంతోషంగాను కొద్ది సంకోచంగాను. నీలి ఎక్కడుంటుందో అడిగి తెలిసుకొంది. ప్రస్థుతం పట్నాయక్ ఊళ్లో లేడని కూడా తెలుసుకొని

"అయితే కార్లో నాతో మా ఇంటికి రా" అని రత్తాలు మనస్ఫూర్తిగా నీలిని పిలిచింది.

"నువ్వేదో పెద్ద ఇంటి కోడల్నాగున్నావ్! నానెల్లరాను?" అని నీలి అనుమానంగా అడిగింది. రత్తాలు తను రాంబాబును పెళ్లి చేసుకొన్న వైనం చెప్పి ప్రస్థుతం రాంబాబు కేంపులో ఉన్నాడని ఇంట్లో ఇంకెవరూ లేరని చెప్పి ఒప్పించింది.

రత్తాలు నౌకర్లందర్ని ఇళ్లకు పంపించేసాక నీలిని మనసారా కౌగలించుకొంది. ఒకే బల్ల మీద అన్నం తిని ఒకే మంచం మీద పడుకున్నారు. ఇద్దరూ రెండోవారి కథలు పూర్తిగా విన్నారు. రత్తాలు బాధపడింది. నీలి, "నువ్వైనా సుఖంగా ఉన్నావు. అదే పదేలు" అంటూ సంతోషించింది.

మర్నాడు పొద్దున్న చంద్రశేఖరం మేస్టారింటి దగ్గర కార్లో దింపించింది నీలిని రత్తాలు.

"ఇవాళ దొర్సాని కార్ల దిగింది. రాత్రి పెద్ద బేరమే తగిలింది" అంది వెటకారంగా పెద్దామె.

నీలి జవాబు చెప్పలేరు. పార్వతమ్మ "ఎవరిదా కారు" అని అడగలేదు. కాని నీలే చెప్పింది.


"మా ఊరి ఆడబొట్టె. ఈ ఊళ్లో పెద్ద ఆఫీసరు గారి బార్యె ఆవిడగుపించి నిన్నరేత్తిరి వాల్లింటికి తీసుకువెళ్లింది" అని.

పార్వతి ఆవచ్చిన కారు ప్రభుత్వం వారిదని గుర్తించే ఉండటం చేత నీలి అబద్ధం చెప్పటం లేదని గుర్తించింది.

**4**

వానాకాలం సగం గడిచింది. నీలి ఎప్పుడైనా ముక్కూ ముఖం తెలియని వాళ్లతో గడిపి అవసరానికి సంపాదించుకొనేది. బ్రోకర్లెవరూ లేకపోవటం చేత, ఆమె గంభీరమైన ప్రవర్తన వల్ల ఆమె ఓ కుటుంబస్త్రీ అని అవసరానికి ఈ అడ్డ దోవ తొక్కుతోందని అర్థం చేసుకొనేవారు. నీలికి అందులో కొంత సుఖం కూడా దొరుకుతోందని అర్థం చేసుకునేనారు కాదు. కాని చుట్టు పట్ల వాళ్లు మాత్రం నీలి శీలాన్ని శంకించసాగారు. ఎప్పుడైనా వచ్చి నీలితో కబుర్లాడే కుతుహలమ్మా నీలింట్లో ఉన్న అలంకరణ సామగ్రిని చూసి. పట్నాయక్ ఎక్కువ రోజులు ఊళ్లో ఉండటం లేదని. నీలి పంతుల్ని మరిగిందని చుట్టు పట్ల ఒకరిద్దరితో అంది. అదే ఆనోట ఈనోట పాకి నిజంలా చెలామణి కాసాగింది. క్రమేపి కొద్ది కొద్దిగా ఆ పుకారు నీలి చెవుల పంతులి చెవుల పడింది.

ఓ సందె వేళ పంతులింట్లో నీలి పని పూర్తిచేసేసరికి ముందు ముసురుగా ఉన్నవాన జడివానగా మారింది. పంతులు భోంచేసేసరికి నీలి భోంచేసి వసారాలో గిన్నెలు తోమేసింది. ఆ జల్లుకామె కొద్దిగా తడిసింది. ఆమె గిన్నెలు లోపల పెట్టింది. పంతులు చుట్ట వెలిగించుకొన్నాడు. ఆ చలిలో నెమ్మదిగా అతని వంట్లో వేడిపరచుకొంది. అంతకు ముందు నీలి గురించి అందమైన దన్న అభిప్రాయం పంతులకుంది. కాని ఆరోజు ఆమెకు కోర్కెలు రేకెత్తించగల అందం ఉందని గ్రహించాడు.




నీలి గిన్నెలు సర్దేసాక వానని తిట్టుకొంటూ ఓ మూల ముడుచుకు కూర్చుంది. ఆ వాతావరణంలో ఆ ఏకాంతంలో ఆ గుడ్డి దీపపు వెలుతురులో పంతులికి ధైర్యం వచ్చింది.

"నిన్ను ముద్దుపెట్టుకోనా?" అని అడిగాడు పంతులు.

నీలి ఆశ్చర్యంగా పంతులకేసి చూసింది. మనిషిలో పిడికెడు మాంసం ఎక్కడా లేదు. బొమికల మీద చర్మంసాగదీసినట్టుటాండు. అటువంటి వారిలో కూడా కోర్కెలుండవచ్చునని నీలి అనుకోలేదు. పంతులింతవరకు తనకి ఓ తండ్రిలా అన్నం పెట్టాడు. ఆసరా ఇచ్చాడు. కాని తన ఆడతనాన్ని కోరలేదు. ఇవాళ ఓ మావలా మనస్సు పడ్తాన్నాడు. తామిద్దరికీ సంబంధం ఉందని జనం ఎల్లాగో అనుకుంటున్నారు. తను ఎలాగో చెడినా ఆడదే. తను ఇప్పటికి పదిమందితోనైనా పడుక్కొంది. పంతులు మరోడు. తప్పేమిటి. పైగా ఉత్తముడు కూడాను అనుకొంది.

నీలి మాట్లాడకపోవడం చూసి మళ్లీ పంతులే అన్నాడు. "ఏమన్నా తప్పు మాటని ఉంటే నా తప్పుకాయి. నా ఆడది

చచ్చిపోయి ఐదేళ్లు అయింది. ఈ ఐదేళ్లలోను నేను ఏ ఆడదాన్ని కోరిందే లేదు. కోర్కెతో తాకిందీలేదు. ఇవాళ నాబుద్ధి కాస్త గడ్డితింది. అంతే" అంటూ పంతులు కళ్ల నీళ్లు పెట్టుకొన్నాడు. అతని దుఃఖం చూసేసరికి నీలికి జాలి కలిగింది.

"నా బాబే! ఊరుకో! ఊరుకో!" అంటూ తన గుండెల మీద అతని తలను అదుముకొంది.

ఆ విధంగా దగ్గరకు తీసుకున్నాక పంతులు ఆమె మెత్తదనాన్ని ఓ నిముషం పాటు అనుభవించి, నీలి నుదురుని ముద్దుపెట్టుకొన్నాడు. నీలి వద్దనలేదు. ఆ తరువాత ఆమె కళ్లని, ముక్కుని మెడని ముద్దులు పెట్టుకొన్నాడు. నీలి కళ్లు మూసుకొంది. ఆమె ముఖంలోకి చూసిన పంతులికి అందులో ఏ భావమూ దొత్యం కాలేదు. అది అయిష్టం మాత్రం కాదని తెలుసుకొని గట్టిగా కౌగలించుకొన్నాడు. అంతులేని ఉద్రేకం వల్ల పంతులు అలసిసొలసి పోయాడు.

తోటకూర కాడలా వడిలిపోయిన పంతుల్ని అల్లాగే పడుక్కోబెట్టి నీలి బట్టలు సరిచేసుకొని "పంతులుకి ఊపిరేలేదు పాపం' అంటూ మరోసారి జాలిపడి ఇంటికి వెళ్లిపోయింది.

ఆ తరువాత పంతులామె మీద చెయ్యి వెయ్యలేదు. పట్నాయక్ రాకలింకా తగ్గిపోయాయి. అటువంటి సమయంలో, నీలి నెలతప్పిన విషయం అర్థమైంది. కొద్దిగా వంట్లో బాధలు మొదలయ్యాయి. కె.జి.హెచ్‌కి వెళ్తే ఆమెకు సుఖరోగాలున్నాయని కడుపులో పిల్ల బతికి పుట్టదని, పుట్టినా బతకదని చెప్పారు. ఇన్నాళ్లు అప్పుడూ అప్పుడూ సుఖం చిల్లరగా అమ్మి సంపాదించిన డబ్బు టోకున ఆస్పత్రికి సమర్పించుకొని కడుపుని జబ్బులు పోగొట్టుకొంది. నీలి రెండోసారి తల్లికాలేకపోయింది.

నీలి నాగాలు పెడ్తోందని మాన్పించెయ్యమని ముసలామె పోరుపెట్టడంతో పార్వతమ్మకి తప్పలేదు. నీరసంగా ఉన్న నీలికి ఉన్న పెద్ద ఆధారం పోయింది.

చుట్టు పట్ల వాళ్లు "ఆ పంతులీ ముండకి అన్నీ అంటించేసాడు" అని బహిరంగంగానే అనసాగారు. తనకి వంట్లో బావుండటం లేదని పని చెయ్యలేకపోతున్నాని తనకేదైనా ఏర్పాటు చెయ్యమని పట్నాయక్‌కి సుభాను ద్వారా కబురు చేసింది. పట్నాయక్ ఉన్న ఊరు వెళ్లిన సుభానుకు పట్నాయక్‌కి నీలి భార్యకాదని అతని వేరే భార్యా పిల్లలున్నారని అర్థమయింది. పట్నాయక్ కొద్దిరోజుల్లో వస్తాడని చెప్పాడు. అతనిచ్చిన పదిరూపాయలు నీలి చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. సుభాను మళ్లీ నీలిని చూడటానికి రాలేదు. తనకి నీలికి చుట్టుపట్ల వాళ్లు రంకు కడ్తారన్న భయంతో. పట్నాయక్ వారం రోజులు పోయాక ఓ వేరుశనగకాయల మూట తీసుకువచ్చి నీలింట్లో పడేసాడు. నీలిలో పూర్వపు నిగనిగ లేదు. నీలి ఊపిరి తగిల్తేనే జబ్బులంటుకొంటాయని భయపడ్డట్టు వెంటనే వెళ్లిపోయాడు. కాని వెళ్లిపోయేముందు ఆమెను విశాఖపట్నం లేపుకు రాకుండా ఉంటే ఆ పల్లెటూళ్లో సుఖంగా ఉండేదేమోనన్న చిన్న పశ్చాత్తాపం కలిగి అయిదు శేర్ల బియ్యం, పప్పులు ఉప్పులు, నూనె కొని ఇచ్చివెళ్లాడు.

పట్నాయక్ అల్లా బేగి పారెల్లి పోతే నీలికేడుపు వచ్చింది. ఆ వెరుశనగ కాయలు మూటలో కొంత భాగం కొట్లో అమ్మి మిగిలిన భాగంలో కొద్దిగా తనుంచుకొని మిగిలింది పంతులింట్లోను, పార్వతమ్మ ఇంట్లోను పడేసింది.

చిక్కి శల్యలా ఉన్న నీలిని చూస్తే పార్వతమ్మకి జాలివేసింది. వేరు శనగకాయలకి డబ్బు ఇవ్వపోతే నీలి తీసుకోలేదు.

"నేనేదైనా అయిపోతే నానోట్లో కాసిని నీల్లోసి వల్లకాటికి పంపడానికి నాకయినోరూ లేరు తల్లీ మీరే దిక్కు" అంటూ ఏడ్చింది. పార్వతమ్మింట్లో ఓ నడివయస్కురాలు పని చెయ్యటం గమనించింది.

"మహా తెచ్చిందో అయిదు రూపాయల కాయలు" అంది ముసలామె, నీలి అభిమానానికి విలువకట్టూ.

"అమ్మా మీరు పెద్దోరు. మీ పక్కన నాను సీమ నాంటి దాన్ని. మీకెందుకమ్మా నా మీన అంత కోపం" అందే కాని నీలి పూర్వంలా పౌరుషంగా జవాబు చెప్పలేదు. ఆమె వంట్లో పౌరుషానికి పోగల శక్తి లేదు. నీలి నెమ్మదిగా లేచి వెళ్లిపోయింది.

నీలిని డాక్టరుకి చూపించి మందిప్పిద్దామని పార్వతమ్మ చంద్రశేఖరాన్ని శతపోరింది. తమ ఇంటి డాక్టర్ని నీలిని చూడమని చంద్రశేఖరం బతిమాలాడు. ఆయన తన పేషంట్లుందరు పెద్ద పెద్ద వాళ్లని తను నీలిని చూస్తే తన ప్రాక్టీస్ పాడవుతుందని చెప్పి ఏవో మాత్రలు పొట్లం కట్టియిచ్చాడు. అవి శ్యామ్‌తో పార్వతమ్మ పంపిస్తే శ్యామ్‌ని చుట్టుపట్ల వాళ్లు తేరిపార చూసి చెవులు కొరుక్కున్నారు.

ఆ మాత్రలకి నీలి ఆరోగ్యం బాగుపడలేదు. కాంపౌండరు డాక్టరిచ్చిన సూదిమందులు పన్చెయ్యలేదు. నీలి ఎండి పోయి మంచానికి అతుక్కుపోయింది. పం తులే ఇంత గంజి కాచి పోస్తున్నాడు నీ లికి. నీలికి పరిస్థితి రోజు రోజుకి దిగ జారుతోంది.

పంతులింక ఆగలేక చంద్రశేఖరం ఇంటికి వచ్చి "పెద్దవారు మీరు పూనుకుని నీలమ్మని ప్రేమసమాజంలో జేర్పించండి. ఆమె ఇంక ఎక్కువరోజులు బతకదు." అని చెప్పాడు.

చంద్రశేఖరం మేస్టారు ప్రేమ సమాజం వారితో మాట్లాడాడు. వాళ్లు నీలిని తీసుకువెళ్లటానికి ఎద్దుబండి పంపారు.

శ్యామ్ దారి చూపించగా పార్వతమ్మ, బండి నీలి ఇంటికి వెళ్లారు. నీలి బల్లిలాగా చాపకంటుకుపోయి ఉంది. పార్వతమ్మ తను డబ్బాలో తెచ్చిన ఇడ్లీముక్క నీలి నోట్లో పెట్టింది. నీలి తినబోతే కొరపోయింది. ఆపని విరమిం చుకొని చెంబులోని కాఫీ చెంచాతో నోట్లోపోసింది.

చుట్టుపట్ల వాళ్లు సోద్యం చూస్తు నిలబడిపోయారు.

బండివాడు పంతులు శ్యామ్ ఆమెను సాయం పట్టి బండీలో పడుకోబెట్టారు. అది మెత్తటి కుషన్లున్న అంబులెన్సుకాదు. గడ్డి కూడా పరవని చెక్క బండీలో పడుకొని పార్వతమ్మకి దండం పెట్టింది.

వెళ్లిపోతూ "ఎల్లిపోతున్నాను. పంతులు బాబో మల్లీరాను. నీరునం వచ్చే జన్మలోనే" అంటూ పంతులకి చేతులెత్తి దండం పెట్టి ఏడ్చింది.

బండి కదిలాక,"నా పెనిమిటొత్తే" అంటూ చెప్పబోతుంటే

"ఆ విషయంలో నిశ్చింతగా ఉండు నీలమ్మా!" అన్నాడు పంతులు. బండితో రెండు అడుగులు వేస్తూ.

బండిలో నీలి పంతులు కని పిస్తున్నంతసేపు చేతులు జోడించుతూనే ఉంది.

అతనామెకి తండ్రి కొడుకు ప్రియుడు కాదు. దేవుడు!

అది జనవరి 26, 1978. ఆ రోజున ప్రేమ సమాజం వారు చేరదీసిన దీనులకి బ్రెడ్డూ పాలు పంచడానికి ఎవరో పెద్దావిడ వస్తోందని సమాజం పెద్దలు హడావుడి పడిపోతున్నారు.

నీలి గాజు కళ్లతో ఆ హడావుడి గమనించింది. పక్కనే ఉన్న రోగి "ఎవరొస్తున్నారు బాబూ!" అని అడిగింది.

"పెద్ద ఆఫీసరు గారి భార్య ఆవి డ వచ్చి మీకు పాలు బ్రెడ్డూ ఇస్తారు" అని చెప్పాడు. రోగుల అవసరాలు చూస్తున్న కుర్రాడు.


శ్రీమతి రత్నా రాంబాబు అట్ట హాసంగా వచ్చింది. ఆమెతో పోలీసులు వచ్చారు. ఫోటోగ్రాఫర్లు వచ్చారు. వంది మాగధులు వచ్చారు. ఆమె రొట్టెలు పాలు పంచుతుంటే పోలీసులు రోగుల్ని ఇతర్లని అదిలిస్తూ హైరానా పడసాగారు. ఫోటోగ్రాఫర్లు అన్ని కోణాల్లోను ఫోటోలు తీయసాగారు. నీలి మంచం దగ్గర ఆమె ఒక క్షణం ఆగింది అనుమానంగా. నీలి అస్థిపంజరానికి చీర రవిక కట్టినట్టుంది కాని రాతి విగ్రహానికి అలంకారాలు చేసినట్టు లేదు. క్రితం చూసినప్పుడు నీలింకా కళకళలాడుతూనే ఉంది. నీలి రత్నాల్ని గుర్తుపట్టింది. కాని అప్పటికే ఆమె నోరు పడిపోయింది. నీలి కళ్లు రత్నాలుని ఆ కట్టుకొంది కాని పోల్చుకొనే టట్టు చేయలేకపోయింది. అనుకోకుండా రత్నాలు తను కప్పుకు వచ్చిన శాలువా నీలికి కప్పింది. ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీసారు. రత్నారాంబాబు కార్లో వెళ్లిపోతున్న సమయంలో నీలి ప్రాణాలు పైలోకానికి వెళ్లిపోయాయి.

ఫోటోగ్రాఫర్లు ఫోటోలిచ్చిన రోజున రత్నాలు వాటిని చూస్తూ నీలీ తనూ ఉన్న ఫోటో చేతిలోకి రాగానే ఆగి పోయి పరీక్షగా చూసింది. అనుమా నంగా చూసింది. ఫోటోలో నీలిపోలికలు తెలు స్తున్నాయి. ఆమె రాంబాబు తో ప్రేమ సమాజానికి మనిషిని పంపి ఆ ఫోటోలో వ్యక్తి గురించి ఆరా తీయించమంది. ఆమె తన ఊరిదని అనుమానం వెల్లడిస్తూ.

"ఎవరో నీలమ్మ అనే వడ్డెది. అడ్డమైన తిరుగుళ్లతో జబ్బులు తెచ్చుకొంది. ఆమెకి నా అన్న వారెవరూ లేరు కాబోలు ఎవరూ రాలేదు. ఆమెను ఆమె పూర్వం పని చేసిన ఇంటి వాళ్లు ప్రేమ సమాజంలో చేర్పించారు. ఆమె జనవరి 26న చని పోయింది" అన్న రిపోర్టు వచ్చింది.

రాంబాబు చంద్రశేఖరం ద్వారా సుభాన్‌ని పట్టుకొని పట్నాయక్‌కి కబురుపెట్టి పిలిపించాడు. పట్నాయక్ తనకు నీలికంత జబ్బుగా ఉన్నట్టు తెలియదన్నాడు. నీలిది అసలే ఊరో కూడా చెప్పాడు కాని నీలి మరోడి భార్య అని చెప్పలేదు. తన భార్య కాదని చెప్పాడు.

రాంబాబు దగ్గర సెలవు తీసుకుని ప్రేమ సమాజంకి వెళ్లి ఆమె వంటి మీద నగలుండాలి అన్నాడు పట్నాయక్. వాళ్లు తమ దగ్గరికి నగల్తో ఆమె రాలేదని చెప్పి ఆమ్మె కంత జబ్బు చేసి దిక్కు మొక్కు లేకుండా పడి ఉన్నప్పుడు రాక నగల కోసం వచ్చావా అంటూ కేకలు వేసి ఆమె అంత్యక్రియలకి అయిన ఖర్చు కట్టమన్నారు. పట్నాయక్ తనకామె ఏమీ కాదని చెప్పి అక్కడ్నుంచి పరుగున బయట పడి నీలి ఉంటూ వచ్చిన




ఇంటికి వెళ్లి చుట్టు పట్ల వారి ద్వారా పంతులు గురించి విని అతనింటికి వెళ్లాడు. తను పట్నాయక్‌ని అన్నాడు. పట్నాయక్ నగలవిషయం ఎత్తకుండానే పంతులు లోపల్నుంచి దుద్దులు, ముక్కపుడక తాళిబొట్టు తీసుకువచ్చి అతనికిస్తూ

" నీలమ్మ వీటిని తన భర్తకిమ్మంది. నువ్వు ఆమె భర్తవి కనక నీ కిస్తున్నాను. నా బాధ్యత తీరింది" అన్నాడు. పట్నాయక్ తను నీలి భర్తను కాదన లేదు. కక్కుర్తిగా ఆ నగలు తీసుకొని సంతోషంగా వెళ్లి పోయాడు నీలి జ్ఞాపకాలతో పంతుల్ని ఏడవటానికి వదిలిపెట్టి.

ఆ రాత్రి రాంబాబు ఆ చనిపోయినామె రత్నాలు ఊరు పిల్లేనని పేరు నీలి అని రత్నాలుతో చెప్పాడు.

ఆ రాత్రంతా నీలి చచ్చిపో యిందని రత్నాలు ఏడుస్తూనే ఉంది.

-●-